మత్తుతో ఆరోగ్యం చిత్తు

- మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలెన్నో
- యువత దూరంగా ఉండాలని పిలుపు
- అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం



చింతలపూడి: మత్తు పదార్థాలపై కోర్టు ఆవరణలో అవగాహన కలిగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు



జంగారెడ్డిగూడెం: విద్యావికాస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ యు.రవిచంద్ర

చింతలపూడి: మత్తు పదార్థాలతో ఆరోగ్యం చిత్తవుతుందని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలయ్యి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని అన్నారు. సిగరెట్, గుట్కా, మద్యం కూడా ఒక రకమైన మత్తు పదార్థాలేనన్నారు. వాటిని విడనాడాలని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి నాగేశ్వరరావు, న్యాయవాదులు రాజ్‌కుమార్, విజయరావు, ఫరూఖ్ ఆలి, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

జంగారెడ్డిగూడెం: సరదాతో మొదలై.. అలవాటుగా మారి, జీవితాన్ని నాశనం చేసే వాటిలో డ్రగ్స్ ఒకటని, యువత దానికి దూరంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం విద్యా వికాస్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన విద్యార్థుల బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. నాడీ వ్యవస్థ పని చేయక విద్యలో వెనుకబడిపోతారని, అనారోగ్య సమస్యలు ఏర్పడి జీవితం పాడవుతుందని హెచ్చరించారు. కావున మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐ పి.రాజేష్, ఎస్సై జి.జ్యోతిబాస్, పోలీస్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో...

జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ డ్రగ్ వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం బుధవారం నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించగా జంగారెడ్డిగూడెం ఏరియా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.పట్టాభిచౌదరి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో అంతర్భాగం కావాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల అలవాటు వల్ల నేర ప్రవృత్తి పెరుగుతుందని, యువత దశ నుంచే డ్రగ్ నిరోధక చర్యలు తీసుకోవటం వల్ల మంచి సమాజం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, సీనియర్ లెక్చరర్లు యు.వెంకటాచార్యులు, డా.సీహెచ్ బదరీ నారాయణ, డా.జి.శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు, బి.అశోక్, ఎం.శ్రీనివాసరావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్.వినయ్, విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై అవగాహన

పోలవరం రూరల్: ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలవరం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల వచ్చే నష్టాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కె.వీరబాబు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల కలిగే అనర్థాల పట్ల వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలవరం: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ జీలుగుమిల్లి మండల కమిటీ భరోసా



జీలుగుమిల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, తాము అండగా ఉంటామని పార్టీ జీలుగుమిల్లి మండల కమిటీ భరోసా ఇచ్చింది. జీలుగుమిల్లి మండల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం ఆ పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల కమిటీ నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, గూడవల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ సిర్రి జగదాంబ, ఎంపీపీ కోర్సా పోచమ్మ, తదితరులు మాట్లాడారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలు కావడం పట్ల కార్యకర్తలు, నాయకులు కొంత నిరాశకు లోనయ్యారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాల పట్ల కార్యకర్తలెవ్వరూ అధైర్యపడవద్దని, అందరికీ అండగా ఉంటామని చెప్పారు. జీలుగుమిల్లి మండలంలో వైఎస్సార్‌సీపీ ఎంతో బలంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌లకు 3 వేల మెజారిటీని జీలుగుమిల్లి మండల ప్రజలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీపై నమ్మకంతో ఓట్లు వేసిన ప్రజలందరికీ రుణపడి ఉంటామని చెప్పారు. ప్రతి కార్యకర్తకు మండల కమిటీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే మండల వ్యాప్తంగా గ్రామగ్రామానికి తిరిగి పార్టీ బలోపేతం చేయడమే కాకుండా రాబోయే స్థానిక ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. తొలుత గ్రామంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను, ఎంపీటీసీ మొడియం వెంకటలక్ష్మి, నాయకులు బూరుగు ప్రేమ్‌కుమార్, చిట్టిబొమ్మ శ్రీను, కక్కిరాల చక్రి, వనమా రామకృష్ణ, కొప్పుల మహేష్, కొప్పుల సత్యనారాయణ, సూరిశెట్టి యేసు, కొప్పుల రాంపండు, తగరం రాంబాబు, గంధం బోస్, ఆకుల రవి, సులకాల బాబు, బొంతు రవితేజ, కుమ్మరి టోని, కుసుమా వెంకట్, కుంజా చిన్నరాము, జి.సుధాకర్, మామిళ్ల కనకరాజు, గంధం చిన్నవెంకటేశ్వరరావు, కంటే కేశవగౌడ్, చాపల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స

ఏలూరు టౌన్: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులకు, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తూ వారికి అండగా ఉంటున్నామని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. రక్తమార్పిడి చికిత్స పొందుతున్న చిన్నారులను ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో కొందరు పిల్లలు రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, ఆరోగ్యంగా ఉన్న యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిపోయి జీవితాన్ని నాశనం చేసుకోవటం బాధాకరమని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. యువత డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి దూరంగా ఉండాలని కోరారు. బుధవారం రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులతోపాటు సహాయకులు 30 మందికి మానవత సభ్యులు టి.రామకృష్ణ ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ కేబీ సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, డాక్టర్ జి.స్పందన, పీఆర్వో కేవీ రమణ, సిబ్బంది ఉన్నారు.

సీతంపేటలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సీతంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ తోటకూర పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి పరిధి సీతంపేట గ్రామంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. దోమల నిర్మూలన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్ ఏసు పరిశీలించి గ్రామ ప్రజలకు పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే చాన్ భాష, హెల్త్ అసిస్టెంట్ టి.మంజునాథ, ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ చైతన్య, తోటకూర శ్రీనివాసు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలి



ఉపాధ్యాయుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు

లింగపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై దృష్టి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి కంట రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. లింగపాలెం మండల విద్య వనరుల కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు ఇద్దరు పాల్గొని మాట్లాడారు. ఎన్‌రోల్‌మెంట్‌పై ఆర్‌జేడీ, డీఈవో జిల్లాలో పాఠశాలను సందర్శించడం జరుగుతుందని, ఇది గమనించి ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేయాలని కోరారు. 90 రోజుల రోజువారి ప్రణాళికను ప్రతి ఒక్కరూ అమలు పరచాలని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి -2 జంగం రవీంద్ర మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిటీల విషయంలో ప్రభుత్వం జీవో ఇచ్చే వరకు పాత విద్యా కమిటీలు కొనసాగుతాయని తెలిపారు. పాఠశాలకు సంబంధించి రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. డీఈవో సమక్షంలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ జరుగుతుందని, ఉపాధ్యాయులు గత ఐదేళ్ల 5 ప్లస్ డేటాతో పాటు ఇప్పటివరకు ఎన్ని అడ్మిషన్లు వచ్చినవో డేటాను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నాడు నేడు పాఠశాలల్లో ఇంకా మిగిలి ఉన్న కాంపోనెంట్స్ అన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇప్పటివరకు నాడు-నేడు కింద సెలెక్ట్ అవ్వని పాఠశాలలను గుర్తించి మూడో విడతలో ఆ పాఠశాలలను సెలెక్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



తడికలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కామవరపుకోట: కామవరపుకోట, తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాఠ్య పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. ముందుగా కామవరపుకోట ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, కామవరపుకోట టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ ఘంటా సుధీర్, మద్దిపోటి నాగేశ్వరరావు, వేముల నాగేశ్వరరావు, కంఠమనేని అంజి మూర్తి, కొయ్యగోర వెంకటేష్, ఎంఈఓ డి.సుబ్బారావు, కూటమి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

లింగపాలెం: ధర్మాజీగూడెంలోని బీసీ కాలనీ పాఠశాలలో బుధవారం మండల విద్యాశాఖ అధికారి జంగం రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు ఖండవల్లి కుటుంబరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

15న జగన్నాథ రథయాత్ర



జగన్నాథ రథయాత్ర పోస్టర్ విడుదల చేసిన ఏలూరు ఎమ్మెల్యే చంటి, పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జూలై 15వ తేదీన నిర్వహించే జగన్నాథ రథ యాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. బుధవారం చంటి క్యాంపు కార్యాలయంలో జగన్నాథ రథ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలో రెండోసారి రథయాత్ర నిర్వహించడానికి ఇస్కాన్ ప్రతినిధులు ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఇస్కాన్ ప్రతినిధి రాధా వల్లభ దాస్ మాట్లాడుతూ రథయాత్ర స్థానిక శనివారపు పేట రోడ్డులోని లునాని పార్కు వద్ద నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై ఆర్ఆర్ పేట, మెయిన్ బజారు, ఫైర్ స్టేషన్ సెంటర్, పెద్ద వంతెన, వన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా తిరిగి రామకోటి వద్దకు చేరుకుంటుందన్నారు. రామకోటి ప్రాంగణంలో స్వామి వారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం, జగన్నాథ లీలా ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులందరికీ జగన్నాథ ప్రసాద వితరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల గుర్తింపు శిబిరం

ఉంగుటూరు: నారాయణపురం జిల్లాపరిషత్ హైస్కూలులో గురువారం దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. ఈ శిబిరంలో గుర్తించిన వారికి ఉపకరణాలు అందజేస్తారని, 18 ఏళ్లలోపు దివ్యాంగులు వినియోగించుకోవాలని ఎంపీపీ కోరారు.

వెల్లమిల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఉంగుటూరు: వెల్లమిల్లి పంచాయితీలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఆయుర్వేద డాక్టరు శిరీష్, దెందులూరు ఆయుర్వేద డా. నగేష్ 120 మందికి వైద్య సేవలు అందించారు. ఆయుర్వేద ఆసుపత్రి సిబ్బంది కృష్ణకుమారి, ఎస్‌కే అంజాద్‌బేగ్, గోపి, మంగన్న పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు

దిశ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ వద్ద మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల బాధలు, ఆవేదనను అర్థం చేసుకుని, వారికి న్యాయం చేయాలని, కేసుల దర్యాప్తులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ కోటదిబ్బ దిశ మహిళా పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిశ స్టేషన్ హెల్ప్ డెస్క్ సేవలను పరిశీలించారు. మహిళా పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న మహిళలతో మాట్లాడారు. వారికి అందుతోన్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. కేసుల నమోదు, పరిష్కారం, నిందితుల అరెస్టులపై సీఐ విశ్వం, ఎస్సై క్రాంతిప్రియను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణాన్ని, అక్కడి పరిస్థితులను ఎస్పీ పరిశీలించారు. ప్రాంగణంలో పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణానికి మొక్కలు నాటాలని సూచించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఫిర్యాదు చేసేందుకు వచ్చే మహిళలతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రతి సమస్యనూ హెల్ప్ డెస్క్‌లో నమోదు చేసి రశీదు ఇవ్వాలని ఆదేశించారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టులు, కేసులకు సంబంధించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై పోలీస్ సిబ్బంది సరైన రీతిలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

ఏలూరు కలెక్టర్‌కు అభినందనలు



మద్ది అంజన్న చిత్రపటాన్ని కలెక్టర్‌కి అందజేస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్విని జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య, జిల్లా దేవాదాయ శాఖ అధికారి సీహెచ్ రంగారావు, మద్ది ఆలయ ఈవో ఆకుల కొండలరావు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కి మద్ది ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేసి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

ఛత్రపతి సాహూ మహారాజ్ జయంతి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఛత్రపతి సాహూ మహారాజ్ జయంతి వేడుకలు

చింతలపూడి: రాజర్షి ఛత్రపతి సాహూ మహారాజ్ 150వ జయంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా పి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహూ మహారాజ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాహు మహారాజ్ సేవలను కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అంటరానితనం, మహిళల సమస్యలపై ఎన్నో చట్టాలను తీసుకువచ్చి అమలు చేసిన ధీరుడు అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏవీఆర్, బి శ్రీనివాసరావు, డా సరస్వతి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఐటీడీఏ పీవో



నూతన కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సూర్యతేజ

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టిన కె. వెట్రిసెల్విని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఏలూరు (టూటౌన్): రజకుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కలెక్టర్ వెట్రి సెల్విని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను బుధవారం కట్లయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీఓ 62 ప్రకారం రజకుల వృత్తి, కుల పరమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు, కమ్మంటి మురళి, కోలుకొండ రత్తయ్య, కడెల్లి సుబ్బయ్య, పదిగల్ల శ్రీనివాసరావు, సాంబశివరావు, దుర్గారావు పాల్గొన్నారు.

రైతువాణి పత్రిక అందజేత

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెట్రి సెల్వికి ఏపీ రైతు సంఘం నాయకులు మన రైతు వాణి వ్యవసాయ పత్రికను అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో రైతాంగ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు అధికారాలు కల్పించాలి



పల్లెం ప్రసాద్

దెందులూరు: జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు గొల్లబాబురావుకు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ కోరారు. ఈ మేరకు లేఖను బుధవారం బాబురావుకు ఈ మెయిల్‌లో పంపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచన చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లు విశిష్ట అధికారాలు ఉంటేనే దేశంలో కోట్లాది మంది దళిత, గిరిజనులకు రక్షణ, న్యాయం, భద్రత, భవిష్యత్తు లభిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై కమిషన్లకు హైకోర్టు అధికారాలు ఇచ్చే వరకు దళితులు తరపున అందరిని కలుపుకుని తన వంతు కృషి చేస్తానని ప్రసాద్ పేర్కొన్నారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 1600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. హైదరాబాద్‌కు చెందిన చింతలపూడి సరోజిని, వారి మనుమరాళ్లు సాత్విక, యువిక పుట్టిన రోజు సందర్భంగా అన్నప్రసాద వితరణ చేసినట్లు కమిటీ సభ్యులు చెప్పారు. అనంతరం బుట్టాయగూడెం రోడ్‌లోని చిన్నపిల్లల అనాథశ్రమానికి అన్నప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో కొమ్మసాని రవీందర్ రెడ్డి, కల్లూరి మురళీకృష్ణ, చల్లా వరప్రసాద్, చెన్నూరు శివాజీ కృష్ణ పాల్గొన్నారు.

నేడు పూల్ క్యాంపస్ డ్రైవ్

జంగారెడ్డిగూడెం: శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు స్థానిక రాజులకాలనీ బాలికల హైస్కూల్ ఎదురుగా ఉన్న రామచంద్ర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు శ్రీరామచంద్ర విద్యాసంస్థల చైర్మన్ బీవీ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 15 కంపెనీల ప్రతినిధులు రిక్రూట్‌మెంట్ ప్రక్రియను నిర్వహిస్తారని, డిగ్రీ లేదా ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొనవచ్చన్నారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వీవీఎస్ జగదీష్‌కుమార్, ఏవో కె.రమేష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన పోలవరం ఎమ్మెల్యే

బుట్టాయగూడెం: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులను పాఠ్యాంశాల బోధనా వివరాలపై అడిగి తెలుసున్నారు. అలాగే ఆహార నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏలూరులో అధ్వానంగా శానిటేషన్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శానిటేషన్ పరిస్థితి అధ్వానంగా ఉందని, సూపర్‌వైజర్ల పనితీరు బాగోలేదని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ పాత కౌన్సిల్ హాలులో పబ్లిక్ హెల్త్ విభాగం సమీక్షా సమావేశం మేయర్ షేక్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబుతో కలిసి ఆయన సమీక్షించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పబ్లిక్ హెల్త్ విభాగంలోని పరిస్థితులపై ఆరా తీశారు. నగరంలో శానిటేషన్ అధ్వానంగా మారిందని, సిబ్బంది ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించలేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిని మేయర్ నూర్జహాన్, పెదబాబు, కార్పొరేటర్లు భీమవరపు హేమసుందరి తదితరులు ఘనంగా సత్కరించారు. ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, కార్పొరేషన్ సెక్రటరీ దివ్యకుమారి, ఇన్‌చార్జి ఎంఈ కొండలరావు, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయశానిటరీ సెక్రటరీలు, కార్పొరేటర్లు ఉన్నారు.

దళితులకు భూమిని అప్పగించాలంటూ ధర్నా

ఏలూరు (టూటౌన్): తమకు భూమి అప్పగించి న్యాయం చేయాలంటూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శింగనపూడి దళితులు ఏలూరు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కైకలూరు మండలం శింగనపూడి గ్రామానికి చెందిన 20 దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన 15.59 ఎకరాల భూమిని 1925 నుంచి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 1992లో చేపల సాగుకు ప్రభుత్వం అనుమతివ్వగా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టలేక కైకలూరుకు చెందిన మాడపాటి కృష్ణప్రసాద్‌కు లీజుకు ఇచ్చారని చెప్పారు. కొంతకాలం లీజు ఇచ్చి ఆ తర్వాత లీజు ఇవ్వకుండా భూమిలోకి హక్కుదారులను రానివ్వకుండా అక్రమంగా సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. 2016 నుంచి అధికారుల చుట్టూ దళితులు తిరుగుతున్నారని, 2022లో గుడివాడ ఆర్డీఓ దళితులకు అనుకూలంగా తీర్పు ఇవ్వగా అమలు కాలేదని వివరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో ఈ భూ సమస్య కేసు నడుస్తోందని, తుది తీర్పు ఇచ్చే వరకు భూమిలోకి ఇరుపక్షాలు వెళ్లకుండా జేసీ ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. దీనిపై స్థానిక తహసీల్దార్ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ బోర్డును తొలగించి జాయింట్ కలెక్టర్ ఆదేశాలను ధిక్కరించి మాడపాటి కృష్ణ ప్రసాద్ దళితులపై దౌర్జన్యంచేసి చేపలు సాగు చేస్తున్నారని వివరించారు. భూ సమస్యను పరిష్కరించి దళితుల భూమిని దళితులకే అప్పగించి న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అనంతరం జేసీ బి.లావణ్యవేణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శింగనపూడి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రా జగదీష్, సభ్యులు పక్కిరి దావీదు, పక్కిరి ఇజ్రాయేలు, పులి సువర్ణరాజు, పి.పాలు, బొడ్డు ఆదాము పాల్గొన్నారు.